


# అమ్మ-ఆవు

కల్లూరు రాఘవేంద్ర రావు

నిక్కరేసుకొని హైస్కూలు కెళ్లే రోజుల్లో జరిగిన ఓ సంఘటన ఈ అరవై రెండేండ్ల వయసులోనూ బాగా గుర్తుంది నాకు.

మా అమ్మ సీతమ్మ. ముందు తరపు పెద్ద ముత్తైదువ. ముఖం నిండా పసుపు, రూపాయంత పెద్ద కుంకుమబొట్టు, తలనిండాపూలు, చేతినిండా గాజులు వేసుకొనేది. తెలుగుపడతి పూర్వ వైభవం ఆమె చీర కట్టులో ఉట్టిపడేది. పూజలు, నోములు, వ్రతాలు అంటూ ఇంట్లో ఎప్పుడూ ఏదో హడావుడి చేసేది. పురాణాలు, పుణ్యకథలు వినేది. భాగవతపద్యాలు, భక్తిపాటలు, దాసకీర్తనలు తెల్లవారఝామున నాల్గింటికే లేచి పాడేది. మొత్తంగా ఆమె సస్సంప్రదాయాలకు పుట్టినిల్లు.

ఊళ్లో చాలా కుటుంబాలు మా కుటుంబంతో సన్నిహితంగా వుండేవి. అమ్మ వాళ్లకో పెద్దదిక్కు. వాళ్లు ప్రతివిషయాన్ని ఆవిడతో చర్చించి సలహాలు, సూచనలు, సహకారాలు తీసుకొనేవాళ్లు. ఆవిడంటే పెద్ద గౌరవం అందరికి.

ఓసారి మా ఊళ్లో ఓ పెద్దాయన స్వర్గస్థుడయ్యాడు. ఆయన పేరుమీద వాళ్లు దశదానాలు చేపట్టారు. గోదానం అందులో ప్రధానమైంది కావడంతో, దాన్ని మా యింటికివ్వాలనుకొన్నారు.

అమ్మనడిగారు. ''ప్రత్యక్షగోదానం స్వీకరించడం కంటే మహాభాగ్యం ఇంకేముంది'' అంటూ, అమ్మ నాన్నకా విషయం చెప్పింది.

నాన్న ఇష్టపడక ''మరో అర్ధ సేరుపాలు అదనంగా తీసుకొంటే పోలే. ఈ పెద్ద టౌన్లో మేపడం కష్టం కదా!'' అని సూటిగా చెప్పాడు. అమ్మ వినకపోవడంతో ఆవు-దూడ యింటిముందు ప్రత్యక్షమయ్యాయి.

ఇంటికొచ్చిన ఆవుదూడకు హారతివ్వడానికి చెల్లాయి సిద్ధంగా వుంది. నేనేమో దానిమెళ్లో పూలమాల వేసాను అది తల విదిలించింది.

''జాగ్రత్త! కొమ్ములు పొడుగ్గా, వాడిగా ఉన్నాయ్'' అంటూ నాన్న హెచ్చరించాడు.

ఆవు ఎరుపు, తెలుపు కలిసిన మిశ్రమ వర్ణంలో వుంది. దూడ చూడముచ్చటగా వుంది. వాటికోసం సిద్ధం చేసిన బియ్యం, బెల్లం, పత్తిగింజల్ని అమ్మ వాటిముందుపెట్టి, వాటిముఖాలకు కుంకుమ బొట్లు పెట్టింది. మూడు ప్రదక్షిణాలు చేసింది. కాళ్లకు మొక్కింది.

నాన్న ఆవును పెరట్లో నాటిన గొత్తుకు కట్టేసాడు. అమ్మ ముఖంలో ఆనందలక్ష్మి తాండవించింది.

ఆవొచ్చిన మరసటిక్షణం నుండి దానిపై ఒక ప్రత్యేకమైన శ్రద్ధపెట్టింది అమ్మ. మాకు కొన్ని సూచనలు చేసి ఏఏ పనులు ఎప్పుడు చేయాలో పూసగుచ్చినట్లు చెప్పింది. అప్పుడు చెల్లాయికో ధర్మసందేహం వచ్చి, ''అమ్మా! ఆవు ఏరూంలో పడుకొంటుందే?'' అని అమాయకంగా అడిగింది. దాంతో అమ్మకు జ్ఞానోదయమై,

''ఏమండీ! ముందు పెరట్లో ఓపాక వేయించండి. ఆవుకు వడదెబ్బతగిలితే కష్టం కదా!'' అంది.

అమ్మ మాటకు తిరుగులేదు. వెంటనే నాన్న ఓ ఐదొందలు అప్పుచేసి పాక వేయించాడు. ఓ అమ్మాయిని వర్తనగా గడ్డిమోపు తేవడానికి ఏర్పాటు చేసాడు.

ఓ రోజు ఆ అమ్మాయి ఎగనామం పెట్టింది. గడ్డిమోపు కోసం అమ్మ నన్ను గడ్డి మార్కెట్టుకు తరిమింది. ఇక ఆ రోజు నుండి ఆ మార్కెట్ వ్యవహారం నా పాలిటికి పడింది.

తెలతెలవారుతుండగానే అమ్మ లేచి గోశాల శుభ్రం చేసేది. గాటిలోని గడ్డితీసి, మంచిగడ్డి వేసేది. ఆవు పంచితం పట్టేది. ఇంటిముందు గోమయంతో అలికేది. పిడకలు తట్టేది. పిండిన పాలను పిడకలమీద ఉదయం, సాయంత్రం కాచేది.

నాన్నేమో ఆవుకు ఒళ్లు కడగడం, కుడితిపెట్టడం, కట్టేయడం, పితికేటప్పుడు దూడను గట్టిగా పట్టుకోవడం మొదలైన పనులు చేసేవాడు.

చెల్లెలేమో గోపూజ సామాగ్రి సర్దడం, తౌడు, పత్తిగింజలు శుభ్రం చేయడం, దూడకు గడ్డివేయడం, పాలు పితికేటప్పుడు ఆవు గంగడోలు నిమరడం- ఇలాంటి పనులు చేసేది.

ఇలా ఇంటిల్లిపాది ఆ గోసేవలోనే సదామునిగి తేలేవాళ్లం.

ఒక్కోసారి నాన్న ఈ కొని తెచ్చుకొన్న ఇక్కట్లకు విసిగి, 'కౌపీన సంరక్షణార్థం పటాటోపః' అనే నానుడిని ప్రయోగించేవాడు. దానర్థం తెలిసిన నేను నవ్వుకొనేవాడిని. చెల్లాయి మాత్రం.

''ఏమిటి నాన్నా! అలా అంటే'' అని అడిగేది.

''రాత్రికి చెబుతాలే ఆ కథ'' అంటూ ముసిముసినవ్వులు నవ్వేవాడు నాన్న.

''దానర్థం, రోజు చిక్కటిపాలు, గట్టిపెరుగు, కమ్మనినేయి తినడం తెలిసిందా!'' అని చెల్లికి చెబుతూ, నాన్న వైపు తిరిగి నవ్వేది అమ్మ.

ఒక్కోసారి పాలు పితికేటప్పుడు ఆవు తన్నేది. పాలచెంబు ఫుట్‌బాల్‌లా ఆమడ దూరం పడేది. అమ్మ చేతిగాజులు పగిలేవి. ఎన్నిసార్లు తన్నిందో అలా! అమ్మ మాత్రం విసుక్కొనేది కాదు. ఆవును తిట్టేదికాదు, కొట్టేదికాదు, ఆమె ఓపికకు చాల ఆశ్చర్యమేసేది.

ఓసారి నాన్న ఆవు బాపతు మేత ఖర్చులెక్కగట్టాడు. ''మనం కట్టుకొన్నది ఆవునా! ఏనుగునా!'' అని అబ్బురపడిపోయాడు. అమ్మ ఆ లెక్కల్ని కొట్టిపారేసేది. కారణం ఇంట్లో పాడి సమృద్ధిగా ఉన్నందుకు, తన గోసేవ నిత్యం సాగుతున్నందుకు.

ఎప్పుడైనా చెల్లాయి, నేను ''ఈ గొడ్డు చాకిరి చేయలేం తల్లీ!'' అంటూ విసుక్కొంటే, అమ్మ కోప్పడక బుజ్జగిస్తూ, గోవుకు సంబంధించిన అనేక పురాణ కథలు చెప్పేది. ఆ కథల ఫలశ్రుతి కూడ వినిపించేది. మూగ జీవాలపై మాకెనలేని ప్రేమ నాటుకొనేలా చేసేది. మేం ఓపిగ్గా వినేవాళ్లమే తప్ప, బదులు చెప్పేవాళ్లం కాదు.


ఓసారి ఆవు మెడతాడు తెంచుకొని పొలాల వెంబడి పరిగెత్తింది. బహుశ దానికి మేం వేస్తున్న మేత చాలడం లేదేమో!

దానికోసం నేను, నాన్న పొలాలు, ఊళ్లోని వీధులు అన్నీ తిరిగి విసిగిపోయాం. కడకు బందిల దొడ్లో పడిన ఆవుకు జుల్మానా కట్టి, ఊరివాళ్లతో నానామాటలుపడి దాన్ని ఇంటికి తెచ్చాం.

ఒక్కోసారి రాత్రిపూట దూడ పలుగు తెంచుకొని ఆవు దగ్గరికెళ్లి పాలు తాగేది. దాంతో మాకారోజు పాలు సున్న.

మరోసారి పాలు పితకనిచ్చేది కాదు. పాలను ఎగచేపుకొనేది. ఇలా నానా రకాలుగా ఇబ్బందులు పెట్టేది.

అయినా అమ్మ మాత్రం విసుక్కోక తప్పు చేసినా బిడ్డను వెనకేసుకొచ్చే తల్లిలా మాట్లాడేది. మాకు మాత్రం ఆ ఆవుతో పూర్తిగా విసుగొచ్చేసింది. దీన్ని వదిలించుకోవడం ఎలా? అని నిత్యం ఆలోచించడం తప్ప మరో ఆలోచన మాకు



లేకుండా పోయింది.

ఈ సందిగ్ధ పరిస్థితుల్లో ఓ రోజు మా పెద్దక్క, బావ వచ్చారు. ఇంట్లోని హైరానా అంతా చూచి అక్క మండిపడి,

"మా పల్లెకు తోలండి. మా మందలోపడుంటుంది. ఈ వయసులో మీకీ జంఝాటనమంతా ఎందుకు?" అంటూ మందలించి వెళ్ళింది.

అక్క మాటకు అమ్మ కూడ ఎదురు చెప్పేది కాదు. ఆ రోజు నుండి 'ఏం చేయడమా!' అని అమ్మ తలపట్టుకొని కూర్చుంది.

ఇంతలో ఆ గోవు కథ మరో అడ్డం తిరిగింది.

ఓ రాత్రి అది ఎప్పటిలాగానే మేత తక్కువై పారిపోయింది. ఈసారి నేను, నాన్న దానిగూర్చి పట్టించుకోలేదు. అయినా అమ్మ ఊరికే వుండనిస్తుందా! ఒక్కటే పోరు.

దూడ కోసం అది తప్పకుండా వచ్చి తీరుతుందని, నాన్న నమ్మకం. ఆ నమ్మకంతోనే అమ్మను ఓదార్చాడు. కాని అది వమ్ము అయింది. అమ్మ దిగులుతో పనిమానేసి పాకవైపే చూస్తూ ఉండిపోయింది.

మూడు రోజులు గడిచింది. దాని జాడ తెలిసింది లేదు. అమ్మ ఏడ్పు మొదలుపెట్టింది. ఇంట్లో ఎవ్వరూ ఒక్క ముద్ద ముట్టిందిలేదు.

"దొంగలు అమ్మడానికి సంతకు తోలుంటార్రా! ఒకసారి పశువుల సంతకెళ్లిరారా!" అంటూ ప్రాధేయపడింది అమ్మ.

నాన్నకు ఓపిక నశించి, "సంతక్కాదు. అది ఏ పుట్టలోనో వుండే తిరుపతయ్యకు పాలివ్వడానికి అడవికెళ్లి వుంటుంది. అక్కడికెళ్లి రమ్మంటావా?" అన్నాడు కోపంగా.

ఇక విధి లేక పదేపదే నన్ను ప్రాధేయపడుతూంది అమ్మ. మేం మాత్రం ఈ సారి మొండికేశాం. అమ్మ మా వైపు దీనంగా చూస్తూ,

"ఆ దూడ ముఖమన్నా చూడండ్రా! తల్లిలేని బిడ్డ ఎంతగా అరుస్తూ వుందో" అని గట్టిగా ఏడ్చింది. అమ్మశోకం చూడలేక పోయాను. అమ్మతో ఓ మాట తీసుకొన్నాను. అదృష్టం కొద్ది ఆవు దొరికితే వెంటనే దాన్ని అక్క ఊరికి తోలాలని. విధిలేని పరిస్థితుల్లో మాటిచ్చింది అమ్మ.

దాంతో నేను, నాన్న సంతకాదుకదా, తిరగని చోటులేదు. కూలిమనిషిని పెట్టి చుట్టుముట్టూ పల్లెలు కూడా తిప్పించాడు నాన్న. కూలిదండగే తప్ప దొరికింది లేదు. దాంతో ఇంట్లో వాళ్లందరికీ గొడ్డు జ్వరం పట్టుకొంది. రాత్రిపగలు దాని ధ్యాసే.

ఓ రోజు సాయంకాలం నేనో చిన్నపాటి సందులో వెడుతూవుంటే ఆకస్మికంగా మా ఆవు కంటపడింది. ఎగిరి గంతేసిదాని మలుగుతాడు పట్టుకొని ఇంటికి తోలు కొచ్చాను.

ఆ శుభవార్త అమ్మ చెవిలో పడగానే వేయి ఏనుగుల బలంతో ఆనందంగా మంచం నుండి పైకి లేచింది. తప్పిపోయిన కుమారుడు దొరికినంత సంతోషాన్ని పొందింది. దాంతో ఆ రాత్రి అందరికి బాగా నిద్రపట్టింది.

పొద్దుపుట్టింది. అమ్మ ఈ ఒక్క పూటైనా దేవుడికి ఆవుపాలు నివేదన చేద్దామని పాలు పితకడానికి సిద్ధమైంది. నాన్న దూడను వదిలాడు.

ఇంతలో ఓ పెద్ద మనిషి పెరట్లో నిలబడ్డాడు. తలకు పేటా చుట్టుకొన్నాడు. చేతిలో పొడుగాటి బాణాకర్ర పట్టుకొన్నాడు. మరో చేతిలో తాడుంది. పెద్ద ఛాతి, కండలు తిరిగిన నల్లటికాయం. నల్లటి పెద్ద మీసాలు. అతనెవరో మా కెవ్వరికి తెలియదు.

ఆయననెవరని అమ్మ సైగ చేసింది. తెలియదని తలూపాడు నాన్న. అలా గుడ్లప్పగించి ఆ మనిషి చూడడం అమ్మకిష్టంలేదు, దిష్టి తగులుతుందని.

నాన్న దూడను లాగిపట్టుకొన్నాడు. అమ్మ పొదుగు తాకింది. అది కాలు విదిలించింది. ఆ పెద్ద మనిషి వెకిలిగా నవ్వుతూ,

"మీది పాలిస్తున్న ఆవు కదా!" అన్నాడు.

"అవును" అంది అమ్మ ధీమాగా.

"ఇప్పుడెందుకీ లేదు తల్లీ!" అన్నాడు వెటకారంగా.

"ఇంతకు ఎవరు నీవు?" అన్నాడు నాన్న కోపంగా.

"ఆ ఆవు మాది..." అన్నాడు ఆ మనిషి కర్కశంగా.

"మీ ఆవా!" అందరూ ఒక్కసారి నోళ్లు తెరచాము.

"చూడయ్యా! అదేరంగు, అవే కొమ్ములు, అదే ముఖం, మా ఆవేదో మాకు తెలియదా!" అంది అమ్మ ధీమాగా.

"నల్లచీరకట్టుకొన్నోళ్లంతా నా పెళ్లాలేనా! ఈ ఆవు చూలుది. అది పాలిస్తుందా? ఆ కడుపు చూస్తే తెలియదా! చెంబెత్తుకొచ్చారు. ఓ గంగాళం తేలేక పోయారా!" అంటూ మా వైపు చురచురా చూస్తూ ఆవు మెడకున్న తాడు విప్పడం మొదలు పెట్టాడు.

నాన్న ఏం మాట్లాడలేకపోయాడు. అది మా ఆవు కాదని నా కర్థమైంది. నే భ్రమపడ్డా అని అర్థమైంది. అమ్మ ఎలా భ్రమపడింది? తప్పిపోయిన బిడ్డ తల్లికి, ప్రతిబిడ్డా తన బిడ్డగానే కనిపించినట్లయిందేమో! ఆ ఆవు మీసాలాయన వెంట 'అంబా' అని పరుగులు తీసింది. అమ్మ నిశ్చేష్టురాలై చెక్క బొమ్మలా నిలబడి పోయింది చూస్తూ. మా దూడ అక్క ఊరికెళ్లిపోయింది. ఆ ఖాళీపాక మా ఇంట్లో ఇప్పటికి అలాగే ఉండిపోయింది. అది అమ్మ-ఆవులను ఎప్పుడూ జ్ఞాపకం చేస్తూ ఉంటుంది.

*



## జంటగా నితిన్, ఇలియానా...

ఐదునెలల సుదీర్ఘ విరామం అనంతరం ఇలియానా సినిమా చేయడానికి అంగీకరించింది. పవన్‌కళ్యాణ్ 'జల్సా' తరువాత ఇలియానా ఏ సినిమా అంగీకరించలేదు. మధ్యలో రజనీకాంత్ యానిమేషన్ సినిమా 'సుల్తానా ది వారియర్'లో చేయబోతున్నట్లు పుకార్లు వచ్చినా అవి నిజం కాలేదు. ఇలియానా సినీరంగానికి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతోంది. ఈ నాలుగేళ్లల్లోనూ ఇంతకాలం ఇలియానా ఖాళీగా వున్న సమయం లేదు. దీనికి పెద్ద కారణం అంటూ లేదంటోంది. రిలాక్స్ కావడానికే ఈ గ్యాప్ తప్ప ఇంకేం కాదని అంది. కాని ఇది నిజం కాదని సినిమా పెద్దలు అంటున్నారు. ఆమె రెమ్యునరేషన్ కోటి రూపాయలకు పెంచడంతో అంత ఇవ్వడానికి నిర్మాతలు వెనకడుగు వేశారు. ఇది కూడా అయిదు నెలల విరామానికి కారణం అని వారు అంటున్నారు. ఇప్పుడు ఇలియానా రెమ్యునరేషన్ సంగతి పక్కన పెట్టి సినిమాల ఎంపికలో ఆచి తూచి అడుగువేస్తానంటోంది. అవకాశాలు వచ్చినా అన్నీ అంగీకరించడం లేదని, కథ, బ్యానర్, దర్శకుడు అన్నీ చూసుకునే చేస్తున్నానని చెప్పింది. ఈ నేపథ్యంలోనే ఇంకా పేరు పెట్టని వి.ఎన్ ఆదిత్య సినిమాలో చేయడానికి ఇలియానా అంగీకరించింది. ఈ సినిమాలో నా పాత్ర చాలా మంచి పాత్ర. నటనకు అవకాశం వున్న పాత్ర. సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగిపోతుంది అని చెపుతోంది. ఇలియానా పక్కన నితిన్ 'సై' చెప్పాడు.